సాక్షి
మంచిర్యాల
శనివారం । 17 । జూన్ । 2023



అధికారుల తనిఖీలు

మందమర్రిరూరల్: మందమర్రిలోని దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆరు దుకాణాల నిర్వాహకులకు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మూడో రోజు శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో 403 మంది విద్యార్థులకు గాను 316 మంది హాజరయ్యారని, 87 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. డీఈవో ఒక పరీక్ష కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ ఐదు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
42.0 /32.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. సాయంత్రం వేళ మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీసు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుది పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హక్ ఆధ్వర్యంలో పరిశీలన సాగింది. మూడు రోజులుగా కమిషనరేట్ పరిధిలో 1654 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. ఈ ప్రక్రియను పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ పరిశీలించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు తమతోపాటు వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ధ్రువపత్రాలు ఒరిజినల్స్, ఒక జిరాక్స్ సెట్ తీసుకొని, తమకు కేటాయించిన రోజు రావాలని డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐలు మధుకర్, శ్రీధర్, ఏవో నాగమణి, డీపీవో సిబ్బంది, ఆర్టీఓ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

20న విద్యా దినోత్సవం

మంచిర్యాలటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, టీఎస్ఆర్ఐఈఎస్, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి వారసత్వం, సంప్రదాయాలు, అభివృద్ధి పథంలో తెలంగాణ, దశాబ్ది ఉత్సవాలు(పాటలు, నృత్యం, డ్రామా విభాగాల్లో) పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, స్పెషల్ ఆఫీసర్లు పాటల పోటీలకు బి.నారాయణరావు 99635 39025, ఐ.శివప్రియ 77318 69015 నంబర్లలో, డ్రామా బండ శాంకరి 95731 96678, కె.జనార్దన్ 90140 34472, నృత్యం కోసం ఇ.సువర్ణ 94904 34534, యు.సురేశ్ 94404 45927 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మంచిర్యాలలో జిల్లా సైన్స్ కేంద్రంలో ప్రతీ విభాగం నుంచి మూడు బృందాలను ఎంపిక చేస్తామని తెలిపారు.

కీటక జనిత వ్యాధులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలో కీటక జనిత వ్యాధులు, కుష్టువ్యాధి కేసులపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కీటక జనిత జోనల్ కోఆర్డినేటర్ శిరీష హాజరై జిల్లాలోని హైడ్రోసిల్ కేసులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ఆపరేషన్లు, లెప్రసీ పాజిటివ్ కేసులు, చిన్నారుల్లో వచ్చే వ్యాధులపై వివరించారు. వ్యాధుల బారిన పడ్డ వారు మందులు తీసుకుంటున్నారా, అవగాహన కల్పిస్తున్నారా అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాందేవ్, సత్యనారాయణ, శివకుమార్, సంతోశ్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

సాగు వర్షాధారమే..!



పత్తి పంట సాగు కోసం ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

- వర్షాధార భూములను గుర్తించిన వ్యవసాయ శాఖ
- జిల్లాలో 1.65లక్షల ఎకరాలు
- రుతుపవనాల రాక ఆలస్యం.. లోటు వర్షపాతం నెలకొంటే..
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలం నుంచి ముందస్తుగా సాగు చేపట్టాలని ప్రభుత్వం రైతులకు సూచించగా.. వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రుతు పవనాల రాక ఆలస్యం, ఎల్‌నినో ప్రభావంతో సాధారణ వర్షపాతం కంటే లోటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనికి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల 7న వానాకాలం సీజన్ సన్నద్ధతలో భాగంగా వర్షాధార భూములపై గ్రామాల వారీగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదికను ఈ నెల 12 వరకు వ్యవసాయ కమిషనరేట్‌కు అందించాలని కలెక్టర్లు, వ్యవసాయ అధికారులను ఆదేశించింది. జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం 3.35 లక్షలు ఉండగా.. అందులో సగం వరకు వర్షాధారంగా సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు సర్వేలో గుర్తించారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతీ గ్రామంలో పర్యటించి వర్షాధార భూముల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. స్థిర నీటి వనరులు లేకుండా వర్షాధారంగా సాగయ్యే ఎకరాలు, గుంటల ప్రాతిపదికన భూములు గుర్తించారు. రుతుపవనాల రాక ఆలస్యం, ఎల్‌నినో ప్రభావం, సాధారణ వర్షపాతం కంటే లోటు నెలకొనే పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ప్రాజెక్టుల కాలువల కింద సాగు, చెరువులు, కుంటల కింద, చెక్‌డ్యాం, బావులు, బోరుబావుల కింద పంటలు సాగవుతున్న భూములు, వర్షాధారంగా సాగు అవుతున్న భూములను గుర్తించారు. గత యాసంగిలో అకాలవర్షాలు, వడగళ్లతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో ముస్ముందు ఇలాంటి విపత్తులు రాకుండా, వాటి బారిన పడకుండా నివారించేందుకు సీజన్‌లను నెల నుంచి 45 రోజుల ముందుకు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ముందుకు సాగేలా లేదు. వర్షాధార లేమి పరిస్థితి నెలకొంటే పంటల సాగులో రైతులకు ముందుస్తు సూచనలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా వివరాలు(ఎకరాల్లో)	
భూ విస్తీర్ణం	10,30,025
సాగు భూమి	3,35,748
సాగులో లేనిది	6,94,277
వర్షాధారంగా సాగు	1,65,472
బోర్ల ద్వారా	53,217
బోరుబావుల కింద	18,442
కాలువల కింద	42,124
చెరువుల కింద	41,742
మొత్తం నీటి పారుదల కింద సాగు	1,70,276
జిల్లాలో భూమి యాజమానులు	1,37,214 మంది
నల్లరేగడి నేలలు	65శాతం
ఎర్రరేగడి నేలలు	30శాతం
ఇసుక నేలలు	05శాతం

వర్షాధార భూములు గుర్తించాం..

జిల్లాలో ప్రాజెక్టు కాలువలు, చెరువులు, కుంటలు, బావులు, బోరుమోటార్లు, చెక్‌డ్యాం, తదితర నీటి వనరుల ద్వారా సాగవుతున్న భూములు, పూర్తి వర్షాధారంగా సాగవుతున్న భూములను గ్రామాల వారీగా గుర్తించి సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాం.
– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

రుతుపవనాల రాక ఆలస్యం

ఇప్పటికే జిల్లాలో రుతుపవనాలు విస్తరించి తొలకరి వర్షాలు కురువాల్సి ఉంది. కానీ వర్షాలు ఆలస్యం అయ్యే కొద్దీ రైతుల్లో సాగుపై దిగులు నెలకొంటోంది. జిల్లాలో వానాకాలంలో అధికంగా పత్తి, వరి సాగు చేస్తుంటారు. 100 శాతం పత్తి వర్షాధారంగానే సాగవుతుంది. వరి వర్షాధారంతోపాటు కాలువలు, బావులు, బోర్లు, చెరువులు, కుంటల కింద సాగు విస్తీర్ణం ఉంటుంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 200.4 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు ఒక్క మిల్లీమీటరు కూడా కురవలేదు. జూన్ నెల సగం ముగిసింది. మరో పదిహేను రోజుల్లో సాధారణ వర్షపాతం కురిసే అవకాశం కనిపించడం లేదు. గతేడాది ఈ సమయానికి సాధారణ వర్షపాతం 98 మిల్లీమీటర్లు కాగా 82 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తి పంట విత్తుకునేందుకు జూలై నెల 10 వరకు అవకాశం ఉంది. రుతుపవానాల రాక ఆలస్యం కావడంతో గతేడాది కంటే ఈ సీజన్ ఇంకా ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొనేలా ఉంది. వర్షపాతం తక్కువగా నమోదైతే స్వల్పకాలిక రకాల సాగు, పప్పుదినుసులు ఇతరత్రా తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటల సాగుకు రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

ఆసిఫాబాద్ నుంచే 'పోడు' పంపిణీ?



బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

- 24న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- బహిరంగ సభలోనే పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 24నుంచే ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదే రోజున సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు రానున్నారు. కొత్త సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, కుమురంభీం విగ్రహం, మాజీ మంత్రి కొట్నాక భీంరావు విగ్రహ ఆవిష్కరణ చేపట్టనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో బహిరంగ సభ నుంచే పోడు పట్టాల పంపిణీ లాంఛనంగా సీఎం కేసీఆర్, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో మొదలయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు సభ నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పోడు పట్టాలు అందజేస్తామని ఫైల్‌పై సంతకం చేశారు. రాష్ట్రంలో పోడు సాగు చేసుకునే వారికి జిల్లాల వారీగా సభలు నిర్వహించి ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో అటవీ భూముల్లో పోడు అధికంగా సాగు చేస్తున్న జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, కుమురంభీం, ఆదిలాబాద్, ములుగు, నిర్మల్ ఉన్నాయి. రాష్ట్రంలో మొదటి ఆరు జిల్లాల్లో ఉమ్మడి జిల్లా నుంచే మూడు జిల్లాల్లో ఎక్కువ మంది గిరిజన లబ్ధిదారులు ఉన్నారు. దీంతో ఇక్కడి నుంచే పోడు పట్టాలు పంపిణీ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం భద్రతా పరంగా ఎటువంటి అవాంతరాలు రాకపోతే ఆసిఫాబాద్ పర్యటనలోనే పట్టాలు అందనున్నాయి. మరోవైపు కొందరు ఆదివాసీ నాయకులు ఇక్కడి నుంచే పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37వేల మందికి, లక్ష ఎకరాల అటవీ భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఈశాన్యం సెంటిమెంట్..

తెలంగాణ రాష్ట్రానికి భౌగోళికంగా కుమురం భీం, మంచిర్యాల జిల్లాలు ఈశాన్యంలో ఉన్నాయి. ఆ సెంటిమెంట్ ప్రకారం కూడా ఇక్కడి నుంచే పోడు పంపిణీ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల మంచిర్యాల జిల్లా పర్యటనలో కొత్త కలెక్టరేట్ ప్రారంభంతోపాటు మూడు కొత్త పథకాలు ప్రారంభించారు. ఎంబీసీ కులాలకు రూ.లక్ష సాయం, సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల సాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, వీటితోపాటు దివ్యాంగులకు నెల పింఛన్ మరో వెయ్యి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతం నుంచే సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నట్లు స్వయంగా సీఎం తెలిపారు. ఈ క్రమంలో కుమురంభీం జిల్లా పర్యటనలో నిర్వహించనున్న బహిరంగ సభ నుంచే పలు ప్రారంభోత్సవాలు చేస్తూ, గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చే ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఇప్పటికీ అధికారికంగా, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన సమాచారం లేదు. కానీ బహిరంగ సభకు మాత్రం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉన్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల వివరాలు అధికారులు తీసుకుంటున్నారు. మరో నాలుగైదు రోజుల్లో సీఎం పర్యటనపై స్పష్టత రానుంది.

అభివృద్ధి దిశగా పట్టణాలు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలు



ప్రశంసపత్రాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో గత తొమ్మిదేళ్లలో పట్టణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాలులో శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి నివేదిక విడుదల చేశారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ, చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని చైర్మన్ పెంట రాజయ్య ఆవిష్కరించారు. కాలేజీరోడ్డులోని ఫంక్షన్ హాలులో పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడారు. మంచిర్యాల మున్సిపాలిటీలో రూ.23 కోట్ల వరకు పట్టణ ప్రగతి నిధులు మంజూరు కాగా, పార్కులు, రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ మాట్లాడుతూ పల్లె, పట్టణ ప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాలు రూపొందించి పాలనను సులభతరం చేసిందని తెలిపారు. అనంతరం మెప్మాలోని మహిళా సంఘాల వారికి రూ.60 లక్షలు ఎస్‌బీఐ గర్మిళ్ల బ్యాంకు, రూ.70 తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణాలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో ఉత్తమ సేవలు అందించిన వారితోపాటు మహిళా సంఘాల్లో సక్రమంగా రుణాలు చెల్లిస్తున్న సభ్యులను సత్కరించారు. వ్యాఖ్యాతగా గుండేటి యోగేశ్వర్ వ్యవహరించారు.

వేదాలను పరిరక్షించుకోవాలి

తాండూర్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు మూలమైన వేదాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీశృంగేరి శివగంగా పీఠాధిపతి పురుషోత్తమ భారతి మహాస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలో మహాదేవ వేద పాఠశాల అనుబంధ శ్రీభారతి తీర్థ కల్యాణ మండప ప్రాంగణంలో నిర్మించిన అన్నదాన మహా మంటపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు తోడ్పడాలని అన్నారు. హైందవ ధర్మానికి మూల బిందువులు వేదాలని పేర్కొన్నారు. ప్రజల్లో భక్తి భావాన్ని, ధర్మాన్ని జాగృతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. అతిచిన్న గ్రామంలో వేద పాఠశాలను నిర్వహించడం అబ్బురంగా ఉందని, వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుద్దిళ్ల మనోహర అవధానిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, వేద విద్యార్థులు, వేద బ్రాహ్మణులు, ఆధ్మాతిక వేత్తలు, పాఠశాల పూర్వ విద్యార్థులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నూర్ మున్సిపాలిటీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న విప్, చైర్‌పర్సన్

చెన్నూర్: మహిళా సాధికరతే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారుల రుణాల మంజూరులో చెన్నూర్ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయి అవార్డు సొంతం చేసుకుంది. కరోనా మహమ్మారితో చిరు వ్యాపారుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు అందజేసింది. రుణ మంజూరులో రాష్ట్ర స్థాయిలో ఐదు మున్సిపాలిటీలు ఎంపిక కాగా అందులో చెన్నూర్ ఉండడం గమనార్హం. హైదరాబాద్‌లోని శిల్పారామం కళావేదికలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు చేతుల మీదుగా ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కమిషనర్ గంగాధర్ అవార్డు అందుకున్నారు.

రుణాల మంజూరు ఇలా..

మున్సిపాలిటీలో చిరు వ్యాపారులు 1167 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1072 మందికి తొలుత రూ.10 వేల చొప్పున మంజూరు చేశారు. రుణాలు సకాలంలో చెల్లించిన 229 మందికి బ్యాంకర్లు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున అందజేశారు. ఇలా రూ.50 వేలు, రూ.2లక్షల చొప్పున రుణాలు పొంది వ్యాపారాభివృద్ధితోపాటు ఆర్థికాభివృద్ధి చెందారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.1.72 కోట్లు రుణాలు అందజేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కమిషనర్ గంగాధర్, మెప్మా టీఎంసీ రామకృష్ణ, తెలిపారు.

'ప్రగతి' వేడుకలకు కౌన్సిలర్లు దూరం



పట్టణ ప్రగతి వేడుకల్లో వేదికపై ఏడుగురు కౌన్సిలర్లు, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- 36 మందికి ఏడుగురే హాజరు
- అధికార పార్టీ సభ్యుల గైర్హాజరుపై చర్చ

మంచిర్యాలటౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచిర్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవానికి అధికార పక్ష కౌన్సిలర్లు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీల్లో మార్పులు, అభివృద్ధి పనులపై ప్రగతి నివేదికలను ప్రజల ముందు ఉంచేందుకు రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తోంది. పాలకవర్గ సభ్యులతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ వేడుకలకు దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని అభివృద్ధి పనుల్లో జాప్యం, ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. 36 మంది కౌన్సిలర్లలో 27 మంది అధికార పార్టీ, తొమ్మిది మంది ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌తోపాటు మరో ఏడుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొన్న నేపథ్యంలో ఫోన్ చేయడంతో మరో నలుగురు కార్యక్రమం ముగిసే సమయానికి హడావుడిగా వచ్చారు. అధికార పార్టీ నుంచే సగం మంది కూడా హాజరు కాకపోవడంపైనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అసంతృప్తి..?

బల్దియాలో పార్కులకు రూ.4.50 కోట్లు, రోడ్లకు రూ.4.50 కోట్లు, నాలుగు జంక్షన్ల అభివృద్ధికి రూ.4కోట్లు కేటాయించి చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. వార్డుల్లో రూ.20లక్షల నుంచి రూ.50లక్షల నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతరత్రా పనులకు కేటాయించారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదు. చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సమావేశాల్లో నిలదీసినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాగునీటి సరఫరా ట్యాంకర్లను పంపించకపోవడమూ గైర్హాజరుకు కారణంగా తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారంలో ఉండి ప్రతిపక్షంలోని వారి ట్యాంకర్లను వార్డుల్లోకి తెప్పించుకోవాల్సి రావడంపై చైర్మన్, అధికారులపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం.

పార్కులపై పట్టింపేది..?

- నిధులు కేటాయించి నెలలు
- అభివృద్ధి పనుల్లో ఆలస్యం
- పట్టణ ప్రజలకు ఆహ్లాదం దూరం



పాతమంచిర్యాలలో ఇంకా పూర్తి కాని పార్కు అభివృద్ధి పనులు

జిల్లా కేంద్రంలోని పార్కుల అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు

పార్కులు	కేటాయించిన నిధులు
పాతమంచిర్యాల పార్కు	రూ.90 లక్షలు
రాముని చెరువు పిల్లల పార్కు	రూ.80 లక్షలు
హైటెక్‌సిటీ ప్లేగ్రౌండ్ పార్కు	రూ.80 లక్షలు
హైటెక్‌సిటీ పార్కు	రూ.50 లక్షలు
గర్మిళ్ల పార్కు	రూ.65 లక్షలు
రాంనగర్ పార్కు	రూ.60 లక్షలు
రాజీవ్‌నగర్ పార్కు	రూ.60 లక్షలు
రెడ్డి కాలనీ పార్కు	రూ.40 లక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని పార్కులను అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినా అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని ఏడు పార్కుల అభివృద్ధికి ఏడాదిన్నర క్రితమే నిధులు కేటాయించారు. కొన్ని మాత్రమే 80శాతం పనులు పూర్తి చేసుకోగా, కొన్ని పార్కుల్లో ఇంకా పనులే ప్రారంభించలేదు. దీంతో ప్రజలకు ఆహ్లాదం మరింత ఆలస్యమవుతోంది. పట్టణ ప్రగతి నిధులను మున్సిపాలిటీలకు కేటాయించడంతో ఆ నిధులలో ఎక్కువ మొత్తంలో పార్కులను అభివృద్ధి చేసేందుకు కేటాయించారు. నిధుల కేటాయించి, కౌన్సిల్ తీర్మానం పొందాక, టెండరు ప్రక్రియ, పనులను ప్రారంభించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రారంభించిన పనులు పూర్తి చేయడంలోనూ కాంట్రాక్టర్లు విఫలం అవుతున్నారు. అయినా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పిల్లల పార్కుకు గ్రహణం

జాఫర్‌నగర్‌లో రాముని చెరువు కట్టను ఆనుకుని పిల్లల పార్కు ఏర్పాటు చేసి, అందులో రూ.10 లక్షలతో చిన్నారులు ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరికరాలు తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఆ ప్రాంతం మొత్తం పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పిల్లలకు పూర్తిస్థాయిలో పరికరాలను ఏర్పాటు చేసి, ఆహ్లాదంగా గడిపేలా రూ.80 లక్షలు కేటాయించి ఏడాది పూర్తయినా, ఇంకా పనులు ప్రారంభించలేదు. ఈ పార్కు ముందే రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ సక్రమంగా లేక, ఇప్పటికే అందులోని కొన్ని పరికరాలు ధ్వంసమయ్యాయి. పిల్లల పార్కు పూర్తయ్యేలోపు ఓపెన్ జిమ్‌లోని పరికరాలు ఉంటాయో లేదోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాముని చెరువును ఆనుకుని ఉన్న పిల్లల పార్కు పనులను త్వరగా పూర్తిచేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిధులు సరే... పనులు ఎప్పుడో

జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో రూ.8 లక్షలతో 15 ఏళ్ల క్రితం పార్కు ఏర్పాటు చేశారు. రెండున్నరేళ్ల క్రితం రూ.5 లక్షలతో పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. అవి ఏడాదికే ధ్వంసమయ్యాయి. దీంతో పట్టణ ప్రగతి నిధులు రూ.60 లక్షలను కేటాయించినా, ఇప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

- పాతమంచిర్యాలలో పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించారు. కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి మధ్యలోనే నిలిపివేశాడు. అనంతరం డీఎంఎఫ్‌టీ, పట్టణ ప్రగతి నిధులు రూ.90 లక్షలను కేటాయించి పనులను గతేడాది ఫిబ్రవరి 19న ప్రారంభించారు. ఇప్పటి వరకు 70 శాతం కూడా పూర్తికాలేదు.
- పాతగర్మిళ్ల పార్కుకు రూ.65 లక్షలు డీఎంఎఫ్ టీ, పట్టణ ప్రగతి నిధులు కేటాయించారు. గతేడాది మార్చి 13న అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇపపటి వరకు కేవలం బోర్ వేయించారు. పనులు ప్రారంభించలేదు. 9 నెలల్లోనే పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్న నిబంధన ఉన్నా కాంట్రాక్టర దానిని పట్టించుకోలేదు.
- హైటెక్‌సిటీ కాలనీలో రూ.80 లక్షలు పట్టణ ప్రగతి నిధులు కేటాయించి, క్రీడా ప్రాంగణం పనులను చేస్తున్నా, 80 శాతం మాత్రమే పూర్తి చేశారు.
- రాజీవ్‌నగర్‌లో రూ.60 లక్షలు కేటాయించి పనులను ప్రారంభించినా ముందుకు సాగడం లేదు.

పనులు తుది దశకు..



పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించినా, టెండర్ల ప్రక్రియలో ఆలస్యం కావడం, పనులను ప్రారంభించడంలోనూ జరిగిన ఆలస్యంతో ఈ వేసవిలోనే పనులను పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నాం. వర్షాకాలం ప్రారంభం నాటికి కొన్నింటిని పూర్తి చేస్తాం. రెండు నెలల్లో అన్ని పార్కులు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. తుది దశకు చేరిన పనులు ఈ నెలలోనే పూర్తి చేస్తాం.
– మధుకర్, మంచిర్యాల మున్సిపల్ ఇంజినీర్

క్లుప్తంగా

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే స్టేషన్ లోని నెంబర్ 2 ప్లాట్ ఫామ్‌పై 65ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పింక్ కలర్ షర్ట్, కాషాయం కలర్ లుంగీ ధరించి ఉన్నాడని, ఎండ తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లోని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94908 71784, 99484 81902 నెంబర్‌లో సంప్రదించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య



పంచాక్షరి మృతదేహం

ఆసిఫాబాద్‌అర్బన్: మతిస్థిమితం కోల్పోయి బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బూరుగుడ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. గ్రామంలో అబ్బూరి పంచాక్షరి (45) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ప్రతిరోజు ఇంట్లో గొడవకు దిగేవాడు. చాలాసార్లు ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ మతిస్థిమితం వ్యాధి తగ్గలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోకి వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

గూడ్స్ రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



పాండు మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని రాంపూర్‌కు చెందిన ముంజం పాండు(67) గురువారం రాత్రి లేతన్‌గూడ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాండు భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్నాడు. భార్య మృతిని జీర్ణించుకోలేక మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలూ ఉండడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి లేతన్‌గూడ సమీపంలో మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్లే అప్‌లైన్‌లో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణ



మేలుజాతి దూడల ప్రదర్శన

- జిల్లాలో పెరుగుతున్న ఆదరణ
- మేలు జాతి పాడి పశువుల సంఖ్య వృద్ధి

దండేపల్లి: పశువుల్లో కృత్రిమ గర్భదారణ విధానంపై ఆదరణ పెరుగుతోంది. గతంలో వందల సంఖ్యలో ఉండే ఈ సంఖ్య ప్రస్తుతం వేలకు చేరింది. ఇందులో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారు. మేలు జాతి పాడి పశువుల సంఖ్యను వృద్ధి చేసేందుకు ఈ కృత్రిమ గర్భధారణ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఎదకు వచ్చిన పాడి పశువుకు కృత్రిమ గర్భధారణ ద్వారా వీర్యం (సెమన్) ఎక్కిస్తున్నారు. అధిక పాల దిగుబడిని ఇచ్చే పాడి పశువుల సంతతిని వృద్ధి చేసేందుకు ప్రభుత్వం సెమన్ పద్ధతిని తీసుకొచ్చింది. మొదట బ్రీడర్ దున్నపోతుల నుంచి వీర్యం(సెమన్) సేకరించి భద్రపరుస్తారు. వాటిని రాష్ట్రంలోని అన్ని పశువైద్య కేంద్రాలకు పంపిస్తారు. దానిని మైనస్ డిగ్రీల చల్లదనంలో భద్రపరిచి సెమన్‌ను ఎల్ఎన్‌టు కంటైనర్‌లో తీసుకెళ్తారు. గతంలో ఎదకు వచ్చిన పశువులను పశువైద్య కేంద్రాలకు తీసుకొచ్చేది. దీంతో ఆలస్యం అయితే ఎద చల్లారిపోయేది. అలా కాకుండా ఎదకు వచ్చినట్లు పశువైద్య సిబ్బంది లేదా గోపాల మిత్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే అరగంటలో రైతు ఇంటికి వెళ్లి ఎదకు వచ్చిన పాడి పశువుకు సెమన్ ఎక్కిస్తారు. ఇది సులువైన పద్ధతి కావడంతో ఎదకు వచ్చిన పాడి పశువులకు సెమన్ ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించేందుకు పశుపోషకులు, పాడి రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువులు జన్మిస్తుండడంతో రైతులు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లాలోని పశువైద్య కేంద్రాల వివరాలు..

జిల్లాలో పశువైద్య కేంద్రాలు	27
పశువైద్య ఉపకేంద్రాలు	15
ఏరియా పశువైద్య కేంద్రాలు	2
గోపాల మిత్ర కేంద్రాలు	25
జిల్లాలో పాడి పశువుల సంఖ్య	1.20లక్షలు
కృత్రిమ గర్భధారణ జరిగినవి	60 వేలు

మేలు జాతి పాడి పశువుల వృద్ధి

కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పాడి పశువులు వృద్ధి చెందుతున్నాయి. దీనికి జిల్లాలో మంచి ఆదరణ ఉంది. పశుపోషకులు కూడా తమ పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నారు. జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాల్లో సెమన్ అందుబాటులో ఉంచుతున్నాం. వీటితో పాటు గోపాల మిత్ర కేంద్రాల్లో అందుబాటులో ఉంది. కృత్రిమ గర్భధారణలో పశువైద్య సిబ్బంది. గోపాల మిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారు.

– వై.రమేశ్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి, మంచిర్యాల

దూడల ప్రదర్శనకు విశేష స్పందన



కృత్రిమ దూడల ప్రదర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గోపాలమిత్ర కేంద్రంలో కృత్రిమ దూడల ప్రదర్శన ఏర్పాటు చేయగా రైతుల నుంచి విశేష స్పందన లభించింది. గోపాలమిత్ర కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలతో నిర్వహించిన ప్రదర్శనలో స్థానిక సర్పంచ్ కొట్టె మహేందర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ శాంతిరేఖలు పాల్గొని మాట్లాడారు. కృత్రిమ గర్భధారణతో కలిగే లాభాలు, దూడలలో యాజమాన్య పద్ధతులపై వివరించారు. అన్నదాతలు గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఏ.రవి, స్థానిక గోపాలమిత్ర ఐ.రవి, పశురైతులు, స్థానికులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



రైలు మిల్లుల్లో తనిఖీ చేస్తున్న అధికారులు



స్వాధీనం చేసుకున్న రాయితీ బియ్యం

- స్టేట్ సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోదాలు
- రాయితీ బియ్యం స్వాధీనం

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌ఆర్‌వో కాలనీ శ్రీ శ్రీనివాస రైస్ మిల్లులో పెద్ద మొత్తంలో రాయితీ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిల్లులో నిల్వ చేసిన 248 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్, కాగజ్‌నగర్ తహసీల్దార్ మునవర్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆ బియ్యాన్ని పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంకు తరలించారు. ఈ మేరకు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. గత అక్టోబర్‌లో ప్రభుత్వానికి బియ్యాన్ని లెవీ కింద ఆ బియ్యాన్ని అందజేయగా నూకల శాతం ఎక్కువగా ఉన్నాయని తిరస్కరించినట్లు రైస్‌మిల్లు యజమాని సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఆ బియ్యంలోని నూకల శాతాన్ని తగ్గించి లెవీ కింద మళ్లీ అప్పగించేందుకు సన్నాహాలు చేయగా ప్రస్తుతం రెండు నెలలుగా రైస్ మిల్లు మరమ్మతుల కారణంగా ఆ బియ్యాన్ని నిల్వ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు యజమాని లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.

విద్యుత్‌షాక్‌తో తాపీమేస్త్రీ మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన తాజుద్దీన్(30) తాపీమేస్త్రీ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రూరల్ ఎస్సై సోనియా వివరాల ప్రకారం.. కూలీ పనిచేసుకునే తాజుద్దీన్ అదే గ్రామంలోని ఒకరి ఇంటి రేకులపై పనిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరాతో విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య సాబేరా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

నక్కలపల్లిలో ఒకరు..



రాములు (ఫైల్)

కోటపల్లి: నీటి కోసం విద్యుత్ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన రెడ్డి రాములు(50) మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామంలో బోరుబావి ద్వారా ఏర్పాటు చేసిన నల్లాల నీటిని పట్టుకునేందుకు విద్యుత్ మోటార్ ఆన్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు రాములు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శారద ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన



వివరాలు నమోదు చేసుకుంటున్న ఉద్యోగి

బెల్లంపల్లి: పాలిసెట్–2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభమైంది. ర్యాంకు ఆధారంగా స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో అధికారులు పరిశీలించారు. 346 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, రామగుండం, మంథని ప్రాంతాలతోపాటు జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, చెన్నూర్, లక్సెటిపేట, కొమురం భీమ్ జిల్లా సిర్పూర్(టీ), కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, బెజ్జూర్ తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 19వరకు, ఆప్షన్లకు తుది గడువు 21వరకు ఉంది. 25 వరకు విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



పుల్లయ్య మృతదేహం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం గొల్ల గుడ గ్రామానికి చెందిన పుల్లయ్య(55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... పుల్లయ్య గురువారం ఉదయం ఆసిఫాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని సిద్ధివినాయక కాలనీ శివారులో పురుగుల మందు తాగి మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరుమన్నారు. భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్లే స్కూల్ యాజమాన్యంపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సందీప్‌గౌడ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదునూరి అభినవ్ మాట్లాడుతూ పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్, కుతూబ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

రోబోనిక్ సెమీ ఆటో అనలైజర్ ప్రారంభం



ఆటో అనలైజర్‌ను ప్రారంభిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–1 డిస్పెన్సరీలో శుక్రవారం రోబోనిక్ సెమీ ఆటో అనలైజర్ పరికరాన్ని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రూ.1.8లక్షలతో ఏర్పాటు చేసిన పరికరం ద్వారా పలు పరీక్షలు తక్కువ సమయంలో చేసే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి ఉద్యోగుల, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సంస్థ ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. ఆయన వెంట ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, డీవై సీఎంవో ఉష, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో స్వచ్ఛ పక్వాడ్



ప్రమాణం చేస్తున్న ఎస్టీపీపీ సిబ్బంది

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో శుక్రవారం స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం సూర్యనారాయణ రాజు హాజరై మాట్లాడారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. రానున్న 15రోజుల వరకు ప్రతీ రోజు వివిధ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఎస్టీపీపీ సిబ్బందితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఏజీఎం (సివిల్) కే.సత్యనారాయణ ప్రసాద్, ఏజీఎం (ఎఫ్అండ్‌ఏ) సుధాకర్, ఏజీఎం (పీసీఎస్) కమలాకర్ భూషన్, ఏజీఎం (ఎఫ్‌జీడి) శ్రీనివాసులు, టిబిజికేఎస్ వైస్ ప్రెసిడెంట్ చుక్కల శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) కేసా సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ లొల్ల రామశాస్త్రీ, ఇతర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం చుట్టూ ప్రహరీ

- ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు



ప్రారంభమైన ప్రహరీ నిర్మాణ పనులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఆర్టీసీ యాజమాన్యం ఎట్టకేలకు స్పందించింది. బస్టాండ్ చుట్టుప్రక్కల ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో కొంతకాలం నుంచి క్రమంగా ఆర్టీసీ భూ భాగాన్నీ ఆక్రమించేందుకు కొందరు యత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏటా భూ వివాదం ఏర్పడుతోంది. రాత్రికి రాత్రే కొందరు భూ దురాక్రమణకు సిద్ధపడుతుండడంతో ఆర్టీసీ భూ భాగాన్నీ పరిరక్షించేందుకు ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు నడుం బిగించారు. ఇందులో భాగంగా భూ కబ్జా కాకుండా ఉండేందుకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో గడిచిన నాలుగు రోజుల నుంచి క్రమంగా ప్రహరీ నిర్మాణ పనులు చకచకాసాగుతున్నాయి. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతంలో ప్రహరీ పనులు సాగుతున్నాయి. ఆ తర్వాత ఫుట్‌బాల్ గ్రౌండ్‌బస్టీ ప్రాంతంలో ప్రహరీని నిర్మించనున్నారు. ఆలస్యంగానైనా ఆర్టీసీ అధికారులు స్థలాన్ని దక్కించుకోవడానికి ప్రహరీ పనులు చేపట్టంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేతన ఒప్పందంపై తప్పుడు ప్రచారం తగదు



సన్మానం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి: 11వ వేజ్‌బోర్డు ఒప్పందంపై కొన్ని కార్మిక సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తూ కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య అన్నారు. శుక్రవారం శాంతిఖని గని, సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కంటే ఈసారి బొగ్గు గని కార్మికులకు మేలైన ఒప్పందం చేశామన్నారు. దేశంలో ఏ పరిశ్రమలో లేని విధంగా 19శాతం వేతనాలు పెంచి కార్మికులకు ప్రయోజనం కలిగించామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని పరిశ్రమల్లో 10ఏళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతుందని, కానీ బొగ్గు గని కార్మికులకు మాత్రం ప్రతి ఐదేళ్లకోసారి వేతన ఒప్పందం అమలవుతోందన్నారు. సింగరేణి కార్మికులు పెంచిన వేతనాలను జూన్ నెల నుండి చెల్లించాల్సి ఉండగా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలను చెల్లించడానికి రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వక పోవడంతో జాప్యం నెలకొందని పేర్కొన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్‌ను విబేధించి వేతనాలు పెంచుకున్నట్లు గుర్తు చేశారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. అంతకు ముందు ఏఐటీయూసీ శ్రేణులు సీతారామయ్యను శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, నాయకులు అశోక్‌కుమార్, రమేష్, సురేష్, మంతెన రమేష్, సంతోష్‌కుమార్, ప్రవీణ్, కొమురయ్య, రాజన్న, ఐలయ్య, రామకృష్ణ, రాంచందర్, స్వామి దాసు, శంకర్ పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్‌ను ఢీకొన్న కారు..



వృథాగా పోతున్న నీరు

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి రెస్క్యూ స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఓ కారు అదుపు తప్పి భగీరథ ప్రధాన పైపులైన్‌ను ఢీకొనింది. కారు వేగంగా వచ్చి ప్రధాన పైపులైన్‌కు సంబంధించిన ఎయిర్ వాల్వును ఢీకొనడంతో నీరు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిసిపడింది. చాలాసేపటి వరకు నీరు వృథాగా పోగా స్థానికులు మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేశారు.

పట్టణ, పల్లె ప్రగతితో అద్భుత ఫలితాలు



మహిళలకు చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బెల్లంపల్లిలో పట్టణ ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ శ్వేత జాతీయ పతాకావిష్కరణ చేశారు. అక్కడి నుంచి ఏఎంసీ మీదుగా కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో పాల్గొని ఆకట్టుకున్నారు. చౌరస్తాలో భారీగా తరలి వచ్చిన మహిళలు, పురప్రజలు మానవహారం నిర్మించారు. ఆ తర్వాత పద్మశాలి భవన్‌లో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, పార్కులు, క్రీడాప్రాంగణాలు, మరుగుదొడ్లు, మార్కెట్‌యార్డులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బెల్లంపల్లిలో దశాబ్దాల నుంచి చిక్కుముడిగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను కొలిక్కి తీసుకొచ్చి 6,700 మంది అర్హులకు ఇళ్లపట్టాలు అందజేసినట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.3.34 కోట్ల చెక్కు, పుర ప్రజలకు ఇళ్లపట్టాలు కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. ఉత్తమ పనితీరును కనబర్చిన ఉద్యోగులకు అవార్డులు, పారిశుధ్య, వైద్య, మెప్మా, మున్సిపల్ సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలదేవి, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, తహసీల్దార్ మధుసూదన్, సీడీపీవో ఉమాదేవి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ పెట్టడం సాధ్యం కాదని, ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని డీఈవో కార్యాలయం ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిడ్ డే మిల్స్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం తమకు సరిపోవడం లేదని, దీనికి తోడు అదనంగా మిక్స్‌డ్ కర్రీ ఇవ్వాలంటే ప్రభుత్వం అదనంగా పది రూపాయలు చొప్పున ఇవ్వాలన్నారు. రోజు రోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రూ. పదిహేను వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

గడువు తేది పొడిగించాలి..

దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతికుల వృత్తిదారులకు ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం పొందేందుకు, ఆన్‌లైన్ దరఖాస్తు గడువును జూలై 20 వరకు పొడిగించాలని, అఖిల భారత విశ్వబ్రాహ్మణ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు కులం, ఆదాయ ధ్రువపత్రాలు అవసరం కావడంతో, ప్రస్తుతం ధ్రువపత్రాల జారీకి సర్వర్ సమస్య నెలకొందని, సకాలంలో ధ్రువపత్రాలు జారీ కావడం లేదన్నారు. దరఖాస్తు కు ఈనెల 20 వరకు గడువు ఉండటంతో చేతి కుల వృత్తి దారులందరు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియను వచ్చే నెల 20 వరకు పెంచాలని కోరారు.